క్లుప్తంగా

ముగిసిన పాలనాయక జాతర


విడిది ఉత్సవాల్లో స్వామి

కుందుర్పి: శ్రీమజ్జనపల్లి గ్రామంలో రెండు రోజులుగా నిర్వహించిన పాలనాయక స్వామి జాతర బుధవారం ముగిసింది. ఉదయం స్వామివారి వెండి పల్లకీ ఉత్సవం, మధ్యాహ్నం 101 మంది చిన్నారులతో బోనాలతో ఊరేగింపు చేపట్టారు. సాయంత్రం గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగిశాయి. కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

విద్యార్థులపై చేయి చేసుకోవద్దు


హెచ్ఎంల సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ సీఐ జయానాయక్

రాయదుర్గంటౌన్: తరగతి గదిలో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ఆలోచనాధోరణి మారాలని, వారిని కొట్టడం లాంటి చర్యలకు పాల్పడరాదని ఎంఈఓ నాగమణి, అర్బన్ సీఐ జయానాయక్ సూచించారు. బుధవారం ఎంపీడీఓ సమావేశ భవనంలో రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈఓతోపాటు అర్బన్ సీఐ జయానాయక్, ఎస్ఐ బాలరాజు, ఎంఈఓ-2 వెంకటరమేష్ హాజరై మాట్లాడారు. విదార్థులు సున్నితమనస్కులుగా ఉంటున్నారని, ఇటువంటి సమయంలో వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడం, బెత్తం చేతపట్టి కొట్టడంలాంటి చర్యలకు పాల్పడిన ఘటనలు తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధ్యాయులు నడుచుకోవాలని, విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించరాదని హితవు పలికారు. నిబంధనల మేరకు ఉపాధ్యాయులు బెత్తం పట్టరాదని, తరగతిలో పిల్లలతో చేతులు కట్టించరాదని, అగౌరవంగా మాట్లాడరాదని సూచించారు. పిల్లల ఆలోచన విధానాలను మార్పు చేసేందుకు కృషి చేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మనిషి జీవితానికి సార్థకత


స్వామికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

కణేకల్లు: ఆధ్యాత్మిక చింతనతోనే మనిషి జీవితానికి సార్థకత లభిస్తుందని కేదార జగత్ గురువు భీమాశంకరలింగ స్వామి పేర్కొన్నారు. వీరశైవ లింగాయత్‌ల ఆహ్వానం మేరకు కేదార్ జగత్ గురువు భీమాశంకరలింగ స్వామి బుధవారం కణేకల్లుకు విచ్చేశారు. స్వామి వారికి పూర్ణకుంభాలతో అర్చకులు, భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. అంతకుముందు స్వామి వారు చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత భక్తులు కలశాలతో స్వామి వారిని ఆహ్వానిస్తూ ఉమాదేవీ అమ్మవారి ఆశ్రమం వరకు తీసుకెళ్లారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సభా వేదికలో ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. మనిషి స్వార్థం వీడి పరోపకారం చేసి ప్రతి ఒక్కరితో ప్రేమ, స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ఈశ్వరుని ఆరాధనతో జీవితంలో అనుకున్న సత్ఫలితాలను పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఉమాదేవీ అమ్మవారు, మృత్యుంజయ్య శాస్త్రి, విశ్వనాథ స్వామి, వీరశైవ లింగాయత్ సంఘం నాయకులు వేలూరు మరియప్ప, తిప్పేస్వామి, శరబన్నగౌడ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు


రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

విడపనకల్లు: మండలంలోని పాల్తూరులో వెలసిన సుంకలాపార్వతీదేవి రథోత్సవంలో భాగంగా బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పది జతల వృషభాలను రైతులు తీసుకువచ్చారు. సీనియర్ విభాగంలోని వృషభాలకు నిర్వహించిన పోటీల్లో అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురం గ్రామానికి చెందిన రైతు గోపాలరెడ్డి వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. ద్వితీయ స్థానంలో నంద్యాల జిల్లా పీఆర్‌పల్లికి చెందిన రైతు శ్రీరాముల యాదవ్ వృషభాలు, తృతీయ స్థానంలో సోములదొడ్డికి చెందిన రైతు రామసుబ్బారెడ్డి వృషభాలు, నాల్గో స్థానంలో అనంతపురంలోని ప్రియాంకనగర్‌లో నివాసముంటున్న రైతు ఓబుళపతి ఆచారి వృషభాలు నిలిచాయి. జూనియర్ విభాగంలో నిర్వహించిన అంతర్రాష్ట్ర వృషభాల బలప్రదర్శనలో శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తికి చెందిన రైతు ముత్తి కొండయ్య వృషభాలు ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాయి.

కళ్యాణదుర్గం మండలం బాల వెంకటాపురం గ్రామానికి చెందిన కార్తీక్ (21) అనే విద్యార్థి పెన్నా పరివాహ ప్రాంతంలో ఈత కోసం వెళ్లి మృత్యువాత పడ్డాడు. సరదగా పైనుంచి నీటిలోకి దూకాడు. ఆ తర్వాత కనిపించకుండా కనుమరుగయ్యాడు. ఈతగాళ్లతో గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు.

గుమ్మఘట్ట మండలం బేలోదులో అమ్మమ్మ, తాతయ్యతో ఉంటూ రెండో తరగతి చదువుతున్న జానీ బీటీపీ కాలువలో పడి ఇటీవల మృతి చెందాడు. మరో విద్యార్థితో కలసి చేపలకోసం గాలం వేసుకుంటూ ప్రమాదవశాత్తు నీటిలో పడి ప్రాణాలు విడిచాడు. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేక పోతున్నారు. ఇలా ఈ మూడు చోట్లే కాదు. వేసవి సీజన్ ముగిసే వరకు ఏదో ఓ చోట ఇలాంటి ఘటనలు ఉత్పన్నం అవుతుంటాయి. జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కళ్యాణదుర్గం మండలం నారాయణపురం సమీపంలోని నీటికుంటలో ఈత కోసం దర్శిత్ (14)తో కలసి మరో ఇద్దరు వెళ్లారు. నీటిలో మునిగిన దర్శిత్ ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానం కలిగిన తోటి విద్యార్థులు ఊర్లో సమాచారం ఇచ్చారు. కుంట వద్దకు చేరుకున్న బంధువులు మృతదేహాన్ని వెలికితీశారు.

ఈత.. కారాదు మృత్యు గీత

- మొదలైన ఎండలు
- ఈతతో సేద తీరేందుకు తహతహ
- జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాలు హరీ


పెన్నా పరివాహక ప్రాంతంలో నీట మునిగిన కార్తీక్‌ను వెలికితీస్తున్న దృశ్యం


బీటీపీ కాలువలో పడి మృతి చెందిన విద్యార్థి జానీ (ఫైల్)

రాయదుర్గం: సరదాగా ఈతకు వెళ్లిన వారు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోతున్నారు. క్రమంగా ఉష్ణోగ్రతలు పెరగడంతో ఈతకు వెళ్లే వారి సంఖ్య పెరిగింది. బావులు, చెరువులు, కుంటలు, కాలువల్లో సందడి కనిపిస్తోంది. కొందరు ఈత రాకున్నా మిత్రులతో కలసి సరదాగా నీటిలోకి దిగుతున్నారు. లోతు తెలియక మునిగి ప్రాణాలు కోల్పోతున్నారు. కన్నవారికి కడుపుకోత మిగులుస్తున్నారు. ఇటీవల రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఐదుగురు ప్రాణాలు విడిచారు. జలవనరుల వద్ద ఆయా శాఖల అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలు పై ఓ కన్నేసి ఉంచాలి. మరికొద్ది రోజుల్లో ఒంటిపూట బడులు, ఆ తర్వాత వేసవి సెలవులు రానున్నాయి. పిల్లల్లో ఆట విడుపు ఎక్కువవుతోంది. దృష్టి సారించకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. వేసవి ఆరంభంలోనే మృతుల సంఖ్య ఇలా ఉంది. జాగ్రత్తలు పాటించకపోతే మరెంతమంది బలి కావాల్సి వస్తుందో ఊహించడం కష్టమే.

40 చెరువులు.. 3 కాలువలు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 40 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, హెచ్చెల్సీతో పాటు జీడిపల్లి రిజర్వాయర్, బీటీపీ ఆయకట్టుకు సాగునీరందరించే మూడు ప్రధాన కాలువలు ఉన్నాయి. వీటికి తోడు ఆయా గ్రామాల్లోని బావులు, కుంటలు, నదుల్లో నీటి ప్రవాహం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈత కోసం వాటి వద్దకు వెళ్లి మృత్యుఒడికి చేరే వారి సంఖ్య పెరుగుతోంది. ఏటా వేసవి ముగిసేలోపు పదుల సంఖ్యలో ప్రాణలు కోల్పోతున్నా జాగ్రత్తలు పాటించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

జాగ్రత్త వహించాలి



నీటి ప్రమాదాల పట్ల ప్రజలంతా జాగ్రత్త వహించాలి. అత్యవసర పరిస్థితుల్లో ఫైర్ సిబ్బందిని సంప్రదిస్తే సహాయక చర్యల్లో భాగస్వాములవుతాం. ముఖ్యంగా మే ఆఖరి వరకు విద్యార్థులు, యువత నీటి వనరుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి.

–శ్రీనివాసరెడ్డి, అగ్నిమాపకశాఖ అధికారి, అనంతపురం

పిల్లలపై నిఘా వేయాలి



ప్రతి ఇంట్లోనూ పిల్లలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి. వేసవి ముగిసే వరకు నీటి కుంటలు, బావులు, చెరువులు, కాలువల వద్దకు వెళ్లకుండా చూడాలి. సెలవు రోజుల్లో ముఖ్యంగా ప్రత్యేక దృష్టి సారించాలి. నీటి వనరుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. గ్రామాల్లో దండోరా వేయిస్తాం. స్విమ్మింగ్ పూల్ పై నిఘా పెంచుతాం. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే నిర్వాహకులపై కఠిన చర్యలు చేపడతాం.

– వసంతబాబు, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం


మాట్లాడుతున్న రీసర్వే డిప్యూటీ కలెక్టర్ తిప్పే నాయక్

కూడేరు: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని రీసర్వే డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని జయపురంలో రీసర్వే చేసిన భూములకు సంబంధించి గ్రౌండ్ వాలిడేషన్‌ను రైతుల సమక్షంలో అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసైన్డ్ భూములకు సంబంధించి ఆన్‌లైన్‌లో పేరు ఉండి సాగులో లేకుండా వేరొకరు ఉంటే సాగులో ఉన్నవారికి పట్టా ఇవ్వడం జరుగుతుందన్నారు. రికార్డు మేరకు రస్తాలు చూపిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ తారుమారై ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే రికార్డులు పరిశీలించి న్యాయం చేస్తారన్నారు. రీసర్వేకి రైతులంతా సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, రీసర్వే డీటీ ప్రసాద్, మండల సర్వేయర్ అయేషా సిద్ధికీ, వీఆర్వో గోపాల్ పాల్గొన్నారు.

హౌసింగ్ సమస్యలు పరిష్కరించండి


హౌసింగ్ ఏఈ చైతన్యతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప

రాయదుర్గంటౌన్: లే అవుట్లలో హౌసింగ్ లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు దరఖాస్తు చేసుకున్న వారి సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ చాంబర్‌లో హౌసింగ్ ఏఈ చైతన్యతో లబ్ధిదారుల సమస్యలపై చర్చించారు. అనేక వార్డుల్లో సచివాలయాల వారీగా హౌసింగ్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, రామాంజనేయులు, బషీర్, దివాకర్, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

రోజూ క్లోరినేషన్ తప్పనిసరి

సాక్షి ఎఫెక్ట్..


మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్

కూడేరు: ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటిని తప్పనిసరిగా రోజూ క్లోరినేషన్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ సిబ్బందిని ఆదేశించారు. సాక్షి దినపత్రికలో బుధవారం ×విజృంభిస్తున్న అతిసార॰ అనే శీర్షికతో వార్త వెలువడింది. దీంతో స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ , వైద్య సిబ్బంది బుధవారం చోళసముద్రం, కలరుట్ల పల్లి గ్రామాల్లో పర్యటించారు. తాగునీటి ట్యాంకుల కొళాయిల వద్ద పరిశుభ్రత, పైపులైన్ లీకేజీలను పరిశీలించారు. ఓవర్‌హెడ్ ట్యాంకులను 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలని తెలిపారు. దిబ్బలు, అపరిశుభ్రత ఉన్న చోట పైపులైన్లు లీకేజీలు ఏర్పడి ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టి.. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మంచి నీటినే తాగాలన్నారు. కలుషితమైన ఆహారాన్ని, నీటిని తీసుకోవదన్ని తెలియజేశారు. సర్పంచ్ ఓబుళమ్మ, సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్ జేఈ భార్గవ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య, ఎంఎల్‌హెచ్‌పీలు మాధవి, మీనాక్షి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంచార జాతుల మహిళలకు రక్షణ కరువు


సమావేశంలో మాట్లాడుతున్న సంచార జాతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు

రాయదుర్గంటౌన్: సంచార జాతుల మహిళలకు రక్షణ కరువైందని సంచార జాతుల ప్రగతిశీల మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.ఇందిరా దేవి, సంచారజాతుల సంఘం రాష్ట ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం పట్టణంలోని శాంతినగర్‌లో సంచారజాతల సమాఖ్య కార్యాలయాన్ని ప్రారంభోత్సవానికి వారు ముఖ్య అతిథులుగా హాజరైన మాట్లాడారు. చిరు వ్యాపారాలు చేస్తూ తిరిగే క్రమంలో దాడులు, లైంగిక వేధింపులకు గురవుతున్న సందర్భాలు జరుగుతుండడం ఆందోళనకరమన్నారు. గత ఏడాది గుంటూరు సమీపంలో పూసలు విక్రయించే ఇద్దరు మహిళలపై దొంగతనం నెపం మోపి వేధింపులకు గురిచేసినట్లు చెప్పారు. ఆర్థికంగా వెనుకబడి సంచార జాతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఇచ్చి ఆదుకోవాలన్నారు. ముఖ్యంగా చిరు వ్యాపారాలు చేసే మహిళలకు రూ.2 లక్షల రుణం అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దాసరి వెంకటేశులు, నాగరాజు, రుద్రప్ప, నాగరాజు రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల రేటు తగ్గించాలి

బొమ్మనహాళ్: మాతాశిశు మరణాల రేటు తగ్గించాలని బొమ్మనహాళ్ పీహెచ్‌సీ డీడీఓ డాక్టర్ శ్రావణ్‌కుమార్ సూచించారు. బుధవారం పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్‌నర్సులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా గర్భిణులను గుర్తించి మూడో నెల నుంచే సరైన పౌష్టికాహారం, ఆరోగ్య పరీక్షలు, వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, బాలింతలను గుర్తించి వెంటనే వారికి అవసరమైన మందులు, చికిత్సలు అందించాలన్నారు. ఇంటింటా తిరిగి వ్యాధులు సోకిన వారిని గుర్తించాలన్నారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సలహాలు, సూచనలివ్వాలన్నారు. కుష్టు, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారి వివరాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మల్లేశ్వరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ వేడుకలు

బొమ్మనహాళ్: శ్రీధరఘట్టలో అంతర్జాతీయ సహకార సొసైటీ వేడుకలను బుధవారం సీఈఓ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏ విధంగా రైతులకు ఉపయోగపడుతుందనే విధానంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

చిరుతల సంచారం

కుందుర్పి: జంబుగుంపల, కుందుర్పి పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా చిరుతలు సంచరిస్తున్నట్లు స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వారం రోజుల్లో కుందుర్పి, బెస్తరపల్లి పరిసర ప్రాంతాల్లో 4 మేకలు, 2 పశువులను చిరుతలు చంపేసినట్లు బాధిత రైతులు తిప్పేస్వామి, ఓబులేసు, నాగన్న, శ్రీనివాసులు తదితరులు తెలిపారు.

IN THE COURT OF THE Ist Addl. DISTRICT JUDGE, ANANTAPURAMU.

A.S. No. 73/2024

Between :

Patil Saraswathamma and another ... Appellants

and

Patil Usha and others ... Respondents

Notice to Respondent No. 3

R3 : Patil Divya W/o. Late P. Malla Reddy R/of D.No. 1/45-A, Tallakera Village and Post, Gummagatta Mandal, Anantapur Dist.

పై నెంబరు అప్పీలులో 3వ రెస్పాండెంటు అయిన మీ హాజరు నిమిత్తం 13-03-2025వ తేదీ ఉదయం 10-30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైనా అక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

P. KRISHNA SWAMY KUMAR
Advocate, Anantapuramu

వైభవంగా సిద్ధావధూత రథోత్సవం



అలంకరణలో సిద్ధావధూత , రథాన్ని లాగుతున్న భక్తులు

ఉరవకొండ: నింబగల్లు గ్రామంలో బుధవారం గురుసిద్ధావధూత రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం భగళముఖి అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం గురుసిద్ధావధూత మూలవిరాట్‌కు ఆకుపూజ, అభిషేకం, మహామంగళ హారతి చేపట్టారు. అనంతరం గురుసిద్ధావధూతను ఊరేగింపుగా రథోత్సవం వద్దకు చేర్చి ప్రదక్షణలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని రథంలో కొలువుదీర్చి లాగారు. గ్రామ పురవీధుల్లో రథోత్సవాన్ని నిర్వహించి తిరిగి ఆలయం వద్దకు చేర్చారు.

సంక్షిప్త సమాచారం

రైతు పాదయాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

విడపనకల్లు: కూటమి సర్కార్ రైతుల సమస్యలను గాలికొదిలేసిందని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 7 నుంచి 10 వరకు ఉరవకొండ నియోజక వర్గం నుంచి కలెక్టరేట్ వరకూ రైతు పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం విడపనకల్లులో కౌలు రైతులతో కలసి రైతు పాదయాత్ర పోస్టర్లను విడుదల చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

బెళుగుప్ప: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, అభివృద్ధి, బలోపేతం అనే అంశాలపై హెచ్ఎం వెంకటప్రసాద్ పర్యవేక్షణలో మండలస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ హరికృష్ణ, వ్యాసరచన పోటీల నిర్వాహక ఉపాధ్యాయులు స్వర్ణలత, ఇమామ్‌సాబ్ పాల్గొన్నారు.

నర్సరీ దగ్ధం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణానికి చెందిన శంకర్ అనే వ్యక్తికి చెందిన నర్సరీకి బుధవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. రూ.1.5 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

రేషన్ సక్రమంగా అందజేయాలి

కళ్యాణదుర్గం రూరల్: రేషన్ సక్రమంగా అందించాలని ఆర్డీఓ వసంత్‌బాబు ఎండీయూ ఆపరేటర్లను ఆదేశించారు. బుధవారం ఆయన మౌతికాపురం, మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లిలో ఎండీయూ వాహనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకాల్లో తేడా వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మానిరేవు గ్రామంలో ముస్లిం శ్మశాన వాటిక కోసం స్థలాన్ని పరిశీలించారు.

నీటి వృథా

ఉరవకొండ: కూడేరు మండలం జల్లిపల్లి సమీపంలో పీఏబీఆర్ ప్రధాన పైప్‌లైన్ ఎయిల్ వాల్వ్ వద్ద లీకేజీ ఏర్పడంతో బుధవారం నీరు వృథాగా పోయింది. పీఏబీఆర్‌లో ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉంది. ఈ సమయంలో నీరు లీకేజీ అవుతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

బెళుగుప్ప: నక్కలపల్లిలో బుధవారం సర్పంచ్ రామిరెడ్డి ట్యాంకర్లతో నీరు సరఫరా చేయించారు. గ్రామానికి ప్రధానంగా శ్రీరామరెడ్డి తాగునీటి పథకంతో పాటు బూదివర్తి వద్ద ఉన్న బోరుబావులతో నీటి సరఫరా జరిగేది. అయితే శ్రీరామరెడ్డి నీరు 20 రోజులపైగా సరఫరా కావడం లేదు. బూదివర్తి నుంచి నక్కలపల్లి గ్రామానికి వేసిన పైప్‌లైన్ ధ్వంసం కావడంతో పాటు బోరుబావి మరమ్మతుకు గురికావడంతో తాగునీటి ఎద్దడి నెలకొంది. సర్పంచ్ తాగునీటి సమస్యను మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం స్వయంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకున్నారు.

చంద్రమౌళీశా.. శరణు


నాగాభరణ వాహనంపై ఊరేగుతున్న చంద్రమౌళీశ్వరస్వామి

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా చంద్రమౌళీశ్వర స్వామి వారు బుధవారం నాగాభరణ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్రస్వామి, మఠం సహాయ కమిషనర్ రాణి ఆధ్వర్యంలో మూలవిరాట్‌ను ప్రత్యేక వాహనం వద్దకు తీసుకొచ్చి నాగాభరణ వాహనంపై ఆశీనులను గావించారు. భక్తుల జయజయధ్వానాల నడుమ ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో మఠం ఏజెంట్ రాజన్నగౌడ్, మఠం జూనియర్ అసిస్టెంట్‌లు గోపి, నారాయణస్వామి, వీరశైవ సంఘం నాయకులు నిరంజన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆవుల మృతి

శెట్టూరు: ఐదుకల్లులో యూరియా కలిపిన నీరు తాగి మూడు ఆవులు మృతి చెందాయి. బాధితుడి వివరాలు మేరకు.. గ్రామానికి చెందిన రైతు గోవిందప్ప మేతకోసం ఆవులను తన పొలంలో వదిలాడు. అయితే పక్కనున్న తోటలో మొక్కజొన్న పంటకు డ్రిప్ వదలడానికి ఒక డ్రమ్ములోని యూరియా కలిపిన నీటిని ఉంచారు. అక్కడికి వెళ్లిన ఆవులు ఆ నీటిని తాగి అక్కడికక్కడే మృతి చెందాయి. ఘటనలో రూ.1.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. పశుశాఖ ఏడీ నాగలింగేశ్వర రెడ్డి ఘటనస్థలికి చేరుకుని మృతి చెందిన ఆవులను పరిశీలించారు.

మండల కమిటీ ఎన్నిక

కూడేరు: ఆంధ్రప్రదేశ్ కల్లుగీత పనివారల సంఘం మండల నూతన కమిటీని బుధవారం ఆ సంఘం జిల్లా కార్యదర్శి రఘు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా ఆర్.బుగ్గప్ప, కార్యదర్శిగా వెంకటనారాయణ, గౌరవ అధ్యక్షులుగా కృష్ణమూర్తి, నాగేంద్ర, ముత్యాలు, ఎర్రిస్వామి, ఉపాధ్యక్షుడిగా రాజు, సహాయ కార్యదర్శిగా ఈ.రాజతో పాటు మరో 20 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

'ఎన్ఎంఎంఎస్'లో ప్రతిభ

ఉరవకొండ: జాతీయ ప్రతిభ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)లో ఉరవకొండ ప్రభుత్వ జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల విద్యార్థి విఘ్నేష్ సత్తా చాటాడు. బుధవారం పాఠశాల హెచ్ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు ఎలిజబెత్ రాణి, ఎన్ఎంఎంఎస్ కో–ఆర్డినేటర్ వెంకట్ తాడికొండ తదితరులు విద్యార్థిని అభినందించారు.

ఫారంపాండ్లకు ప్రాధాన్యత

కూడేరు: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో రైతుల పొలాల్లో ఫారంపాండ్ల తవ్వకాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ కుళ్లాయి స్వామి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనుల కల్పనపై ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

భూసార పరీక్షలతో లాభాలు

కూడేరు: భూసార పరీక్ష చేయించుకుని నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ విజయ కుమార్ తెలియజేశారు. బుధవారం ఎంఎంహళ్లిలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు.

ఆట స్థలం కేటాయించాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 27వ వార్డు ఆత్మకూరు వీధిలోని జాకీర్ హుస్సేన్ ఉర్దూ స్కూల్, డీపీఈపీ తెలుగు స్కూల్, ఏఏఐ ఉర్దూ యూపీ స్కూల్ విద్యార్థుల కోసం ఆట స్థలం కేటాయించాలని కాలనీవాసులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు బుధవారం 25, 27వ వార్డు కౌన్సిలర్లు నసీమా, లుబ్నా గజాలతోపాటు పార్టీలకు అతీతంగా నాయకులు, కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఎంఈఓ నాగమణి, తహసీల్దార్ నాగరాజు కు వినతిపత్రం అందజేశారు.